25-05-26 ప్రాతఃమురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి, నేను కర్మేంద్రియజీత్‌గా అయ్యానా, ఏ కర్మేంద్రియమూ నన్ను మోసం చేయడము లేదు కదా!"

ప్రశ్న:- కర్మాతీతులుగా అయ్యేందుకు పిల్లలైన మీరు మీతో మీరు ఏ ప్రతిజ్ఞను చేసుకోవాలి?

జవాబు:- మీతో మీరు ఏమని ప్రతిజ్ఞ చేసుకోండి అంటే - ఏ కర్మేంద్రియము ఎప్పుడూ కూడా చంచలమవ్వకూడదు. నేను నా కర్మేంద్రియాలను వశం చేసుకోవాలి. బాబా ఏ డైరెక్షన్లు అయితే ఇచ్చారో, వాటిని అమలులోకి తీసుకురావాల్సిందే. బాబా అంటారు - మధురమైన పిల్లలూ, కర్మాతీతులుగా అవ్వాలంటే ఏ కర్మేంద్రియముతోనూ వికర్మలు చేయకండి. మాయ చాలా శక్తివంతమైనది. కళ్ళు మోసం చేస్తాయి కావున స్వయాన్ని సంభాళించుకోండి.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. స్వయంలో ఏవైతే చెడు అలవాట్లు ఉన్నాయో - వాటిని చెక్ చేసుకుని తొలగించుకునేందుకు కృషి చేయాలి. మీ సత్యాతి-సత్యమైన లెక్కాపత్రాన్ని పెట్టుకోవాలి. తండ్రి డైరెక్షన్లపై నడవాలి.
2. తండ్రి పేరు అప్రతిష్ఠపాలు అయ్యే విధమైన కర్మలేవీ చేయకూడదు. మీ ఉన్నతి పట్ల శ్రద్ధ వహించాలి. కొద్దిగా కూడా చెడు దృష్టిని పెట్టుకోకూడదు.

వరదానము:- స్థూలముగా మరియు సూక్ష్మముగా ప్రతి ఆజ్ఞను పాటించే సంపూర్ణ ఆజ్ఞాకారీ భవ

ఎవరైతే సూక్ష్మ ఆజ్ఞలను పాటిస్తారో, ఆ పిల్లలకే స్థూల ఆజ్ఞలను పాటించే శక్తి వస్తుంది. సూక్ష్మమైన మరియు ముఖ్యమైన ఆజ్ఞ ఏమిటంటే - నిరంతరం స్మృతిలో ఉండండి మరియు మనసా-వాచా-కర్మణా పవిత్రముగా అవ్వండి. సంకల్పములో కూడా అపవిత్రత లేక అశుద్ధత ఉండకూడదు. ఒకవేళ సంకల్పములోనైనా పాత అశుద్ధ సంస్కారాలు టచ్ చేసినట్లయితే సంపూర్ణ వైష్ణవులు లేక సంపూర్ణ పవిత్రులు అని అనరు. అందుకే ఒక్క సంకల్పము కూడా ఆజ్ఞకు విరుద్ధముగా నడవకూడదు, అప్పుడు సంపూర్ణ ఆజ్ఞాకారులు అని అంటారు.

స్లోగన్:- తండ్రిని తెలుసుకుని హృదయపూర్వకముగా బాబా అని అనడము - ఇది అన్నింటికంటే పెద్ద విశేషత.

<u>అవ్యక్త ప్రేరణలు</u>

సదా అచంచలమైన, స్థిరమైన, ఏకరస స్థితిని అనుభవము చేయండి

ఏకరస స్థితిని తయారుచేసుకునేందుకు కర్మయోగులుగా అవ్వండి, కర్మయోగి ఎదురుగా ఎవరు, ఎలా వచ్చినా కానీ వారు స్వయం సదా అతీతముగా మరియు ప్రియముగా ఉంటారు. వీరిది ఈ పాత్ర నడుస్తూ ఉంది అని జ్ఞానము ద్వారా తెలుసుకుంటారు, వారు మంచిని మంచిగా భావిస్తూ సాక్షిగా అయ్యి చూస్తారు మరియు చెడును దయార్ద్ర హృదయులుగా అయ్యి దయా దృష్టి ద్వారా పరివర్తన చేసే శుభ భావనతో సాక్షిగా అయ్యి చూస్తారు, ఇదే ఏకరసముగా అయ్యేందుకు సాధనము.

26-05-26 ప్రాతఃమురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - స్వయంగా భగవంతుడే మనకు
టీచర్‌గా అయి చదివిస్తున్నారు అని సదా ఇదే సంతోషములో ఉండండి,
మనము వారి నుండి రాజయోగాన్ని నేర్చుకుంటున్నాము, ప్రజాయోగము కాదు"

ప్రశ్న:- ఈ చదువు యొక్క ప్రత్యేకత ఏమిటి? మీరు ఎప్పటివరకు పురుషార్థము చేయాలి?

జవాబు:- ఎవరైతే ఈ చదువును చాలా సమయము నుండి చదువుతూ వస్తున్నారో, వారికన్నా కొత్త పిల్లలు చురుకుగా ముందుకు వెళ్ళిపోతారు. 3 నెలల చురుకైన బుద్ధి కల (తీవ్ర పురుషార్థీ) కొత్త పిల్లలు, పాతవారికన్నా ముందుకు వెళ్ళగలరు, ఇది కూడా ప్రత్యేకతే. ఎప్పటివరకైతే పూర్తిగా పాస్ అవ్వరో, కర్మాతీత అవస్థ ఏర్పడదో, అన్ని లెక్కాచారాలు సమాప్తమవ్వవో, అప్పటివరకు మీరు పురుషార్థము చేయాలి.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఈ వజ్రతుల్యమైన అమూల్యమైన జీవితాన్ని గవ్వల వెనుక పోగొట్టుకోకూడదు. మృత్యువు ఎదురుగా నిలబడి ఉంది, అందుకే తమదంతా ఆత్మిక సేవలో సఫలం చేసుకోవాలి.
2. చదువు పట్ల మరియు చదివించేవారి పట్ల సత్యమైన ప్రీతిని పెట్టుకోవాలి. భగవంతుడు మనల్ని చదివించేందుకు వస్తారు, ఈ సంతోషములోనే ఉండాలి.

వరదానము:- క్యాచింగ్ పవర్ ద్వారా తమ అసలైన సంస్కారాలను క్యాచ్ చేసి
వాటి స్వరూపముగా అయ్యే శక్తిశాలి భవ

పురుషార్థానికి ముఖ్యమైన ఆధారము - క్యాచింగ్ పవర్. ఏ విధముగా శాస్త్రజ్ఞులు చాలాకాలం కిందటి శబ్దాన్ని క్యాచ్ చేస్తారో, అదే విధముగా మీరు సైలెన్స్ శక్తి ద్వారా మీ ఆది దైవీ సంస్కారాలను క్యాచ్ చేయండి, దీని కొరకు సదా ఇదే స్మృతి ఉండాలి - నేను అలా ఉండేవాడిని, మళ్ళీ అలా అవుతున్నాను. ఎంతగా ఆ సంస్కారాలను క్యాచ్ చేస్తారో, అంతగా వాటి స్వరూపముగా అవుతారు. 5 వేల సంవత్సరాల నాటి విషయము, నిన్నటి విషయమే అన్నంత స్పష్టముగా అనుభవమవ్వాలి. మీ స్మృతిని అంత శ్రేష్ఠముగా మరియు స్పష్టముగా తయారుచేసుకోండి, అప్పుడు శక్తిశాలిగా అవుతారు.

స్లోగన్:- బ్రాహ్మణ జీవితము యొక్క శ్వాస సంతోషము.
శరీరము పోయినా కానీ సంతోషము పోకూడదు.

అవ్యక్త ప్రేరణలు

సదా అచంచలమైన, స్థిరమైన, ఏకరస స్థితిని అనుభవము చేయండి

ఒక్క వేటుతో ఒప్పందము కుదుర్చుకునేవారు ఒక్కరికి చెందినవారిగా ఉన్న కారణముగా సదా ఏకరసముగా ఉంటారు. మిగిలినవారు ఎవరైతే కొంచెం-కొంచెంగా ఒప్పందము కుదుర్చుకుంటారో, ఒక్కదానికి బదులుగా రెండు నావలపై కాళ్ళు పెట్టేవారిగా ఉంటారో, వారు సదా ఏదో ఒక తికమకతో కూడిన అలజడిలో ఉంటూ ఏకరసముగా అవ్వరు, అందుకే ఒప్పందము కుదుర్చుకోవాలంటే క్షణములో కుదుర్చుకోండి, మనసును ముక్కలు-ముక్కలుగా చేయకండి.

27-05-26 ప్రాతఃమురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - మీ చేత కాలుడిపై విజయము పొందేలా చేసేందుకు,
కాలుడికే కాలుడైన బాబా వచ్చారు, మన్మనాభవ మంత్రముతోనే
మీరు కాలుడిపై విజయము పొందుతారు"

ప్రశ్న:- ఆత్మిక తండ్రి ఆత్మిక యాత్రికులైన మీకు ఏ విశేషమైన శిక్షణను ఇస్తారు?

జవాబు:- ఓ ఆత్మిక యాత్రికులారా – మీరు దేహాభిమానాన్ని వదిలి దేహీ–అభిమానులుగా అవ్వండి. రావణుడు అర్ధకల్పము నుండి మిమ్మల్ని దేహాభిమానులుగా చేసాడు, ఇప్పుడు ఆత్మాభిమానులుగా అవ్వండి. ఈ ఆత్మిక జ్ఞానాన్ని సుప్రీమ్ ఆత్మయే మీకు ఇస్తారు, ఇతరులెవ్వరూ ఇవ్వలేరు.

పాట:- ఓం నమ: శివాయ...

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఆత్మిక యాత్రను చేయాలి మరియు చేయించాలి. స్వయాన్ని సతోప్రధానముగా తయారుచేసుకునేందుకు ఒక్క తండ్రినే స్మృతి చేయాలి. ఆత్మాభిమానులుగా అయ్యేందుకు పూర్తి పురుషార్థము చేయాలి.
2. కాలుడిపై విజయాన్ని పొందేందుకు తండ్రి శిక్షణల పట్ల అటెన్షన్ పెట్టాలి. స్వయాన్ని ఆత్మగా భావిస్తూ ఆత్మలకు జ్ఞానాన్ని ఇవ్వాలి.

వరదానము:- బాప్‌దాదా కర్తవ్యాన్ని తమ లక్ష్యముగా చేసుకునే
మాస్టర్ మర్యాదా పురుషోత్తమ భవ

"తమలోని విశేషతలను ఎంతగా తలచుకుంటారో, అంత నషా ఎక్కుతుంది" అని అంటారు. ఇతరుల సంపాదన పట్ల ఎప్పుడూ దృష్టి వెళ్ళకూడదు. ఇతరుల నషాను లక్ష్యముగా చేసుకునేందుకు బదులుగా బాప్‌దాదా గుణాలను మరియు కర్తవ్యాన్ని లక్ష్యముగా చేసుకోండి. బాప్‌దాదాతో పాటు అధర్మము యొక్క వినాశనము మరియు సత్య ధర్మము యొక్క స్థాపనా కర్తవ్యములో సహాయకులుగా అవ్వండి. అధర్మాన్ని వినాశనము చేసేవారు అధర్మ కార్యాన్ని గాని లేక దైవీ మర్యాదను ఉల్లంఘించే కార్యాన్ని గాని చేయలేరు. వారు మాస్టర్ మర్యాదా పురుషోత్తములుగా ఉంటారు.

స్లోగన్:- నాలెడ్జ్‌ఫుల్‌గా అయి వ్యర్థ ప్రశ్నలను స్వాహా చేసినట్లయితే
సమయము పొదుపు అవుతుంది.

అవ్యక్త ప్రేరణలు

సదా అచంచలమైన, స్థిరమైన, ఏకరస స్థితిని అనుభవము చేయండి

ఏదైనా సంకల్పము వస్తే దానిని పై వారి ముందు ఉంచి స్వయం నిస్సంకల్పులుగా అవుతూ వెళ్ళండి. మీ ఆలోచన చెప్పటము, సూచన ఇవ్వటము, ఇది వేరే విషయము, కానీ అలజడిలోకి రావటమనేది వేరే విషయము. కావున సదా ఏకరసముగా ఉండండి. సంకల్పాన్ని చెప్పారు మరియు నిస్సంకల్పులుగా అయిపోయారు, అంతే. నేను కర్మేంద్రియజీతునిగా అవ్వాలి అని సదా అటెన్షన్ ఉండాలి. ఏ ఒక్క కర్మేంద్రియానికి చెందిన ఆకర్షణ ఉన్నా సరే, అది ఒక్క బాబాకు చెందినవారిగా అవ్వనివ్వదు, ఏకరస స్థితిలో స్థితులవ్వనివ్వదు.

28-05-26 ప్రాతఃమురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - మీరు మీ ఉన్నతమైన భాగ్యాన్ని తయారుచేసుకునేందుకు తండ్రి వద్దకు వచ్చారు, ఎంతగా శ్రీమతాన్ని అనుసరిస్తారో, అంత ఉన్నతమైన భాగ్యము తయారవుతుంది"

ప్రశ్న:- భక్తిలో ఉండే ఏ అలవాటు ఇప్పుడు పిల్లలైన మీలో ఉండకూడదు?

జవాబు:- భక్తిలో కొద్దిగా దుఃఖము కలిగినా, అనారోగ్యము వచ్చినా, ఓ రామా, ఓ భగవంతుడా, అని అంటారు. అయ్యో-అయ్యో అని అంటూ ఆర్తనాదాలు చేసే అలవాటు భక్తిలో ఉంటుంది. ఇప్పుడు మీరు ఇటువంటి మాటలను నోటి ద్వారా ఎప్పుడూ రానివ్వకూడదు. మీరు లోలోపలే మధురమైన బాబాను ప్రేమగా స్మృతి చేయాలి.

పాట:- భాగ్యాన్ని మేలుకొలుపుకుని వచ్చాను...

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. చదువు ఆధారముగా తమ భాగ్యాన్ని ఉన్నతముగా తయారుచేసుకోవాలి, మనుష్యుల నుండి దేవతలుగా అవ్వాలి. పావనముగా అయి తిరిగి ఇంటికి వెళ్ళాలి, మళ్ళీ కొత్త ప్రపంచములోకి రావాలి.
2. చేతులతో పని చేస్తూ - ఒక్క తండ్రి స్మృతిలో ఉండాలి. ఎటువంటి తప్పుడు విషయాలను వినకూడదు, వినిపించకూడదు.

వరదానము:- సదా మీ పవిత్ర స్వరూపములో స్థితులై గుణాల రూపీ ముత్యాలను ఏరుకునే హోలీహంస భవ

హోలీ హంసలైన మీ స్వరూపము పవిత్ర స్వరూపము మరియు మీ కర్తవ్యము సదా గుణాల రూపీ ముత్యాలను ఏరుకోవడము. అవగుణాల రూపీ రాళ్ళను ఎప్పుడూ బుద్ధిలో స్వీకరించకూడదు. కానీ ఈ కర్తవ్యాన్ని పాలన చేయడానికి సదా ఒక ఆజ్ఞ గుర్తుండాలి, అదేమిటంటే - చెడు ఆలోచించకూడదు, చెడు వినకూడదు, చెడు చూడకూడదు, చెడు మాట్లాడకూడదు... ఎవరైతే ఈ ఆజ్ఞను సదా స్మృతిలో ఉంచుకుంటారో, వారు సదా సాగర తీరములో ఉంటారు. హంసల నివాస స్థానమే సాగరము.

స్లోగన్:- నడుస్తూ-తిరుగుతూ ఫరిశ్తా స్వరూపములో ఉండటము - ఇదే బ్రహ్మాబాబా మనసుకు ఇష్టమైన కానుక.

<u>అవ్యక్త ప్రేరణలు</u>

సదా అచంచలమైన, స్థిరమైన, ఏకరస స్థితిని అనుభవము చేయండి

సదా అచంచలముగా-స్థిరముగా ఉండేందుకు స్వ ఉన్నతి మరియు సేవా ఉన్నతిలో సదా బిజీగా ఉండండి, సర్వుల పట్ల శుభ భావనను పెట్టుకోండి. సంబంధాల ఆధారముగా పాత్రను అభినయించకుండా, సేవా సంబంధముతో పాత్రను అభినయించండి. రెండవది - వినాశీ సాధనాలను ఆసరాగా లేక ఆధారముగా చేసుకోకండి, అవన్నీ నిమిత్తమాత్రముగా ఉన్నాయి, సేవ కొరకు ఉన్నాయి. సేవార్థము కార్యములో ఉపయోగించండి, ఆ తర్వాత అతీతులైపోండి. సాధనాల ఆకర్షణకు మనసు ఆకర్షితమవ్వకూడదు.

"మధురమైన పిల్లలూ - ఈ పాత ప్రపంచము పట్ల మరియు దేహధారుల పట్ల ఎప్పుడూ మనసు పెట్టుకోకండి, మనసు పెట్టుకున్నట్లయితే అదృష్టము పాడైపోతుంది"

ప్రశ్న:- పిల్లలకు తండ్రి ఈ నాటకము యొక్క ఏ గుహ్య రహస్యాన్ని వినిపించారు?

జవాబు:- పిల్లలూ - ఇప్పుడు ఈ నాటకము సమాప్తమవ్వనున్నది, అందుకే ఆత్మలందరూ ఇక్కడ హాజరవ్వాల్సిందే. అన్ని ధర్మాల ఆత్మలు ఇప్పుడు ఇక్కడ హాజరవుతారు ఎందుకంటే సర్వుల తండ్రి ఇక్కడ హాజరై ఉన్నారు. అందరూ తండ్రి ఎదురుగా సలాం చేయడానికి రావాల్సిందే. అన్ని ధర్మాల ఆత్మలు మన్మనాభవ మంత్రాన్ని తీసుకుని వెళ్తారు. వారేమీ మధ్యాజీ భవ మంత్రాన్ని ధారణ చేసి చక్రవర్తులుగా అవ్వరు.

పాట:- మనసు యొక్క ఆధారము తెగిపోకూడదు...

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఈ పాత ప్రపంచములో ఉంటూ పురుషార్థము చేసి సర్వగుణ సంపన్నులుగా తప్పకుండా అవ్వాలి. ఈ పాత శరీరము పట్ల మరియు పాత ప్రపంచము పట్ల మనసు పెట్టుకోకూడదు. అదృష్టవంతులుగా అవ్వాలి.
2. ఆత్మాభిమానులుగా మరియు పరమాత్మ-అభిమానులుగా ఉండాలి. ఈ వినాశన సమయములో తండ్రి నుండి ఏదీ దాచిపెట్టకూడదు. అవినాశీ సర్జన్ నుండి సలహా తీసుకుంటూ ఉండాలి.

వరదానము:- సాంగత్య దోషము నుండి దూరంగా ఉంటూ సదా తండ్రికి సమీపముగా ఉండే భాగ్యాన్ని ప్రాప్తి చేసుకునే పాస్ విత్ ఆనర్ భవ

ఒకవేళ తండ్రికి సమీపముగా ఉండటము ఇష్టమైతే, మరి ఎప్పటికీ ఎలాంటి సాంగత్య దోషము నుండైనా దూరంగా ఉండండి. ఎన్నో రకాల ఆకర్షణలు పరీక్షల రూపములో వస్తాయి కానీ ఆకర్షితులవ్వకండి. సాంగత్య దోషము చాలా రకాలుగా ఉంటుంది. వ్యర్థ సంకల్పాలు, మాయా ఆకర్షణలతో కూడిన సంకల్పాల సాంగత్యము, సంబంధీకుల సాంగత్యము, వాణి యొక్క సాంగత్యము, అన్నదోషం యొక్క సాంగత్యము, కర్మల సాంగత్యము... ఈ సాంగత్య దోషాలన్నింటి నుండి స్వయాన్ని రక్షించుకునేవారే పాస్ విత్ ఆనర్‌గా అవుతారు.

స్లోగన్:- మీరు ఫరిశ్తాగా అయినట్లయితే పరిస్థితులలో తండ్రి స్వయంగా మీకు ఛత్రఛాయగా అవుతారు.

<u>అవ్యక్త ప్రేరణలు</u>

సదా అచంచలమైన, స్థిరమైన, ఏకరస స్థితిని అనుభవము చేయండి

సదా ఏకరసముగా, అచంచలముగా-స్థిరముగా ఉండేందుకు మరియు ఇతరులను అలా తయారుచేసేందుకు విశేషమైన శక్తి ఈ డ్రామా పాయింటు. దీనిని శక్తి రూపములో ధారణ చేసేవారు ఎప్పుడూ ఓడిపోలేరు, కానీ ముందు డ్రామా అనే బిందువును పెట్టి వ్యర్థ సంకల్పాలను శుద్ధ సంకల్పాలలోకి పరివర్తన చేయండి, ఆ తర్వాత మాయ ద్వారా వచ్చే అనేక రకాల విఘ్నాలను ఈశ్వరీయ తపన యొక్క ఆధారముతో సమాప్తము చేయండి.

30-05-26 ప్రాతఃమురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - మీదంతా ఈశ్వరీయ సేవలో సఫలం చేసుకుని భవిష్యత్తును తయారుచేసుకోండి, ఎందుకంటే మృత్యువు తలపై ఉంది"

ప్రశ్న:- జ్ఞానాన్ని వింటున్నా సరే పిల్లల్లో దాని ధారణ ఎందుకు జరగడము లేదు?

జవాబు:- ఎందుకంటే విచార సాగర మంథనము చేయడము రాదు. బుద్ధియోగము దేహము మరియు దేహ సంబంధాలలో వేలాడుతూ ఉంది. ముందు బుద్ధి నుండి మోహము తొలగితే, ఎంతోకొంత ధారణ జరుగుతుంది. మోహమనేది ఎటువంటిదంటే, అది పూర్తిగా కోతిలా చేసేస్తుంది, అందుకే తండ్రి పిల్లలకు మొట్టమొదటి ప్రతిజ్ఞను గుర్తు చేయిస్తున్నారు - దేహ సహితముగా, దేహపు సర్వ సంబంధాలను మరవండి మరియు నన్ను స్మృతి చేయండి.

పాట:- భోళానాథుని కన్నా అతీతమైనవారు...

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. వినాశనము కంటే ముందే మీదంతా సఫలం చేసుకోవాలి. ఇది వినాశన సమయము, అందుకే పావనముగా తప్పకుండా అవ్వాలి.
2. దేహధారుల నుండి మోహాన్ని తొలగించి మోహజీతులుగా అవ్వాలి. మొదటి నంబరు శత్రువైన దేహాభిమానముపై విజయము పొందాలి. ఇతర సాంగత్యాలన్నింటినీ వదిలి, తండ్రితో బుద్ధియోగాన్ని జోడించాలి.

వరదానము:- స్మృతి యొక్క మంత్రము ద్వారా సంకల్పాలు మరియు కర్మలలో అవినాశీ సిద్ధిని ప్రాప్తి చేసుకునే సిద్ధి స్వరూప భవ

పిల్లలైన మీరు ఆల్మైటీ గవర్నమెంట్ యొక్క మెసెంజర్లు, అందుకే ఎవరితోనైనా ఏదైనా చర్చించడములో మీ మనసును డిస్టర్బ్ చేసుకోకండి. స్మృతి యొక్క మంత్రాన్ని ఉపయోగించండి. ఎలాగైతే ఎవరైనా వాణి ద్వారానైనా లేక ఇంకే రకంగానైనా వశమవ్వకపోతే మంత్ర తంత్రాలను ఉపయోగిస్తారో, అలా మీ వద్ద ఆత్మిక దృష్టి అనే నేత్రం మరియు మన్మనాభవ అనే మంత్రము ఉన్నాయి, వాటి ద్వారా మీ సంకల్పాల సిద్ధిని పొంది సిద్ధీ స్వరూపులుగా అవ్వగలరు.

స్లోగన్:- కర్మ కాన్షస్‌గా (కర్మ స్మృతి) ఉండేందుకు బదులుగా సోల్ కాన్షస్‌గా (ఆత్మాభిమాని) అవ్వండి.

<u>అవ్యక్త ప్రేరణలు</u>

సదా అచంచలమైన, స్థిరమైన, ఏకరస స్థితిని అనుభవము చేయండి

ఏకరసముగా ఉండటమంటే అర్థం పురుషార్థపు వేగము సదా ఒకే విధముగా ఉండటమని కాదు. ఏకరసము అనగా సదా ఎగిరే కళ యొక్క అనుభూతి ఉండాలి, సర్వ సంబంధాల అవినాశీ బంధము ఒక్కరితోనే జోడించబడి ఉండాలి. ఒక్క బాబా తప్ప మరెవ్వరూ లేరు అన్న దృఢ సంకల్పము ఉండాలి, వారితో ఒక్క సంబంధము కూడా తక్కువ ఉండకూడదు, సర్వ సంబంధాల బంధము ఒక్కరితో బంధించబడి ఉండాలి, అప్పుడు ఏకరస స్థితి స్వతహాగా ఉంటుంది.

31-05-26 ప్రాతఃమురళి ఓంశాంతి "అవ్యక్తబాప్‌దాదా" రివైజ్-15-03-2010 మధువనం

"పరమాత్ముని ప్రేమకు పాత్రులైన ఆత్మలు, దుఃఖముతో ఉన్నవారికి సుఖపు అంచలిని ఇవ్వండి, వ్యర్థాన్ని సమాప్తము చేసి సమర్థులుగా అవ్వండి మరియు సమయాన్ని సమీపముగా తీసుకురండి"

- ఈ రోజు బాప్‌దాదా తమ నలువైపులా ఉన్న పరమాత్మ ప్రియులైన పిల్లలను చూస్తున్నారు.
- సమయ సమీపత అనుసారంగా వ్యర్థ సంకల్పాలు కూడా అపవిత్రతకు గుర్తే. మొత్తం రోజంతటిలో ఇది కూడా చెక్ చేసుకోండి – ఏ వ్యర్థ సంకల్పాలు, అభిమానముకు సంబంధించినవి కానీ లేక అవమానముకు సంబంధించినవి కానీ తమ వైపుకు ఆకర్షించడము లేదు కదా?
- దుఃఖము మరియు అశాంతి నలువైపులా భిన్న-భిన్న స్వరూపాలలో పెరుగుతూ ఉంది. దాని కొరకు పవిత్రతా వైబ్రేషన్లు అవసరము. ఇప్పుడు ఆత్మలకు ఎక్స్‌ట్రా సకాష్ కావాలి. మనసా సేవ ద్వారా సకాష్‌ను ఇవ్వండి, ధైర్యాన్ని ఇవ్వండి, ఉల్లాస-ఉత్సాహాలను ఇవ్వండి. కావున ఇప్పుడు డబుల్ సేవ యొక్క అవసరము ఉంది.
- ఇప్పుడు మనసా సేవ ద్వారా తండ్రికి సమీపంగా తీసుకురండి. మీ ముఖము మరియు నడవడిక ద్వారా, మీ నయనాలలో తండ్రి ప్రత్యక్షమవ్వాలి.
- వేస్ట్‌ను సమాప్తం చెయ్యడానికి బెస్ట్ సంకల్పాలు కావాలి. అందుకే ప్రతిరోజూ మురళిలో ఏదైతే వరదానము, స్లోగన్ వస్తుందో, అది వినండి. ఈ వరదానమే శ్రేష్ఠ సంకల్పము. ఎప్పుడైతే వ్యర్థము వస్తుందో, అప్పుడు మనసుకు శ్రేష్ఠ సంకల్పాలు కావాలి. ఉదయము కళ్ళు తెరవగానే మొట్టమొదటగా శివబాబాకు గుడ్ మార్నింగ్ చెప్పండి.

వరదానము:- మీ మూర్తి ద్వారా తండ్రి మరియు టీచర్ యొక్క రూపాన్ని ప్రత్యక్షము చేసే అనుభవీ మూర్త భవ

మీ అసలైన స్థితిలో స్థితులై ఉండటం – ఇదే స్మృతియాత్ర. మీరు ఎవరు, ఎవరికి చెందినవారు అన్నదానిలో స్థితులై ఉండండి, ఈ అసలైన స్వరూపము యొక్క నిశ్చయముతో మరియు అనేక సార్లు విజయము యొక్క స్మృతితో సదా నషాతో కూడిన స్థితి అనే సాగరములో తేలియాడుతూ ఉంటారు. సుఖదాత పిల్లలు అన్నప్పుడు దుఃఖము యొక్క అల ఎలా రాగలదు. సర్వశక్తివంతుని పిల్లలు శక్తిహీనులు ఎలా అవ్వగలరు! ఈ స్థితి యొక్క అనుభవాలలో ఉన్నట్లయితే మీ మూర్తి ద్వారా తండ్రి మరియు టీచర్ యొక్క రూపము స్వతహాగా ప్రత్యక్షమవుతుంది.

స్లోగన్:- సత్యవాది ఎవరంటే, ఎవరి ముఖము మరియు నడవడికలో దివ్యత ఉంటుందో వారు.

<u>అవ్యక్త ప్రేరణలు</u>

సదా అచంచలమైన, స్థిరమైన, ఏకరస స్థితిని అనుభవము చేయండి

ఎప్పుడైతే పిల్లలైన మీరు మీ భృకుటి సింహాసనముపై అకాలమూర్తులుగా అయ్యి స్థితులవుతారో, అప్పుడు ఏకరస స్థితి అనే సింహాసనముపై మరియు బాప్‌దాదా హృదయ సింహాసనముపై విరాజమానమవ్వగలరు. ఎప్పుడైతే ఈ దైవీ సంగఠన యొక్క మూర్తిలో ఏకరస స్థితి ప్రత్యక్ష రూపంలో సాక్షాత్కారమవుతుందో, అప్పుడు బాప్‌దాదా యొక్క ప్రత్యక్షత సమీపముగా వస్తుంది, దీని కొరకు ప్రతి ఒక్కరి సంస్కారాలు బాప్‌దాదా సమానమైన సంస్కారాలుగా అవ్వాలి.